క్లుప్తంగా

పాండలమ్మకు ప్రత్యేక పూజలు



పాండలమ్మకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

పెదవేగి : నియోజకవర్గంలోని ప్రజలంతా సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. ఆదివారం పెదవేగి మండలం కొండలరావుపాలెంలో వెలసిన పాండలమ్మ తల్లిని ఎమ్మెల్యే కొఠారు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని ప్రజలంతా సంతోషంగా ఉండేలా అర్చన చేయించి, తీర్థప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో విజయరాయి సొసైటీ చైర్మన్ పాలడుగు పెదబాబు, ఎంపీటీసీ సభ్యులు దేవళ్ళరాజు రాధిక రాజశేఖర్, స్థానిక నాయకులు ముళ్ళపూడి వీర్రాజు, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మానవత ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు



మానవత సమావేశంలో మాట్లాడుతున్న మంద జయలక్ష్మి

ఉంగుటూరు: వైద్య శిబిరాలు నిర్వహించి మరిన్ని సేవలు మానవత ద్వారా అందిస్తామని సంస్థ రీజియన్ చైర్మన్ పుప్పాల గోపి అన్నారు. ఆదివారం మానవత సమావేశం ఉంగుటూరులోని మంద జయలక్ష్మి ఇంటి వద్ద నిర్వహించారు. ఈ సమావేశంలో గోపి మాట్లాడుతూ మానవత సభ్యులు సేవాభావంతో పని చేయాలని కోరారు. సమావేశానికి అధ్యక్షత వహించిన మానవత మండల అధ్యక్షుడు గంజి రవి మాట్లాడుతూ సభ్యత్వాలు ఈనెలాఖరులోపు పూర్తి చేయాలని కోరారు. జిల్లా విజిలెన్సు మోనటరింగ్ సభ్యుడిగా నియామకం పొందిన మానవత సహాయ కార్యదర్శి కోనే వీరవెంకటసత్యనారాయణను సభ్యులు సత్కరించారు. సమావేశంలో మానవత సభ్యులు శీతాల సత్యనారాయణ, బొమ్మిడి అప్పారావు, మంద జయలక్ష్మి, పాతూరి వంశీ, పిళ్ళారామకృష్ణ, పాండ్రాకుల శ్రీనివాసరావు, దొంతల విజయకుమార్, రంగరావు పాల్గొన్నారు.

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాట్నాలమ్మవారు

పెదవేగి : మహిమ గల తల్లి రాట్నాలమ్మకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెదవేగి మండలం రాట్నాలకుంటలో వేంచేసిన రాటాన్లమ్మ ఆలయానికి ఆదివారం జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఈ వారం అమ్మవారికి పూజా టికెట్ల విక్రయం ద్వారా రూ.30,870, విరాళాలు రూ. 8,253, లడ్డూ ప్రసాదం విక్రయంతో రూ.20,625, ఫొటో విక్రయంతో రూ.1,860, మొత్తం రూ.61,608 ఆదాయం లభించిందని దేవస్థాన చైర్మన్ చల్లగొళ్ళ వెంకటేశ్వరరావు చెప్పారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా కార్యనిర్వహణాధికారి ఎస్ సతీష్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రజలకు మేలైన సేవలు అందించాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రజలకు మేలైన సేవలు అందించడానికి లయన్స్ క్లబ్‌ల ప్రతినిధులు ముందుకు రావాలని ఆంధ్రప్రదేశ్ లయన్స్ సంఘాల అధ్యక్షుడు, శాసన మండలి సభ్యుడు వంక రవీంద్రనాథ్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక జిల్లా లయన్స్ భవనంలో ఏర్పాటు చేసిన గ్లోబల్ యాక్షన్ టీమ్ వర్క్‌షాప్‌నకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పూర్వ పశ్చిమగోదావరి జిల్లాలోని 65 లయన్స్ క్లబ్‌ల ప్రతినిధులకు నాయకత్వ లక్షణాలు, సంఘాల నిర్వహణ తీరుతెన్నులపై ఆయన శిక్షణ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి గ్రామంలో వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేసి నిపుణులైన వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచిందని, వారితో లయన్స్ సేవా సంస్థలు కలిసి ఆరోగ్య శిబిరాలు నిర్వహించి ప్రజలకు మేలైన సేవలు చేయవచ్చని సూచించారు.

నేరాల్లో జోక్యం చేసుకోవద్దు

ఏలూరు టౌన్: ప్రజల శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని ఏలూరు టూటౌన్ ఎస్సై శుభశేఖర్ రౌడీషీటర్లను హెచ్చరించారు. స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు ఆయన కౌన్సెలింగ్ ఇచ్చారు. మంచి మార్గంలో ఉంటే రౌడీషీట్ తొలగించేందుకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామని తెలిపారు. నేరాలు, ప్రైవేటు సెటిల్మెంట్లు చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

గణనాథుడి నిమజ్జనోత్సవాల సందడి

- వైభవంగా స్వామివారి విగ్రహాల ఊరేగింపు
- మండపాల వద్ద అన్న సమారాధన



భీమడోలు: మహాగణపతి స్వామి ఊరేగింపు



పెదపాడు: రామచంద్రపురంలో విఘ్నేశ్వరస్వామికి హారతులందిస్తున్న అర్చకులు



గణపవరం: బువ్వనపల్లిలో గణనాథుడి ఊరేగింపు



భీమడోలు: అరుంధతీ కాలనీలో వినాయకుని ఊరేగింపు



దెందులూరు: శ్రీరామ మారుతీగౌడ సంఘం యూత్ ఆధ్వర్యంలో గణనాథుడి ఊరేగింపు



భీమడోలు : ఆకట్టుకున్న శక్తి వేషాలు

భీమడోలు: గణనాథుల నిమజ్జనోత్సవాలతో గ్రామాలు హోరెత్తాయి. ఆదివారం సెలవు రోజు కావడంతో ఈ విఘ్నేశ్వర స్వామి వార్ల నిమజ్జన ఊరేగింపుల్లో చిన్నారులు, యువత, పెద్దలు పెద్ద ఎత్తున పాల్గొని సందడి చేసారు. వాడవాడలా చలువ పందిళ్లలో ప్రతిష్ఠించిన స్వామి వారిని సుందరంగా అలంకరించి వాహనాల్లో ఊరేగించారు. భీమడోలు, పోలసానిపల్లి, గుండుగొలను, సూరప్పగూడెం, కొల్లేరు గ్రామాల్లోని ప్రతి గ్రామంలోనూ నాలుగైదు విగ్రహాలను నిమజ్జనం చేసారు. భీమడోలులోని పెరుమాళ్ల స్తంభం వద్ద గల శ్రీమహాగణపతి స్వామి వారి 11వ మహోత్సవం, భీమడోలు రైల్వే గేటు వద్ద అభయ గణపతి, అరుంధతీ కాలనీ, పోలసానిపల్లి తదితర గ్రామాల్లోని స్వామి వార్లను ఊరేగించారు. వివిధ శక్తి వేషాలు, విచిత్ర వేషధారణలతో కళాకారులు నృత్య ప్రదర్శనలు చేసారు. తీన్‌మార్ డప్పు వాయిద్యాలతో ఊరూరా మార్మోగింది. అనంతరం గోదావరి కాలువలో విగ్రహాలను నిమజ్జనం చేసారు. భీమడోలు జంక్షన్ వద్ద వినాయక చవితి ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. భీమడోలులోని శ్రీమన్మహా గణనాథుని 59వ వార్షికోత్సవంలో భాగంగా స్వామి వారు నలుపు వర్ణంలో భక్తులకు దర్శనమిచ్చారు.

నిమజ్జనానికి తరలిన గణనాథులు

గణపవరం: వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం గణపవరం, నిడమర్రు మండలాల్లో పలుచోట్ల గణనాథుల ఊరేగింపులు, నిమజ్జనోత్సవాలు వైభవంగా నిర్వహించారు. తీన్‌మార్ వాయిద్యాలు, విచిత్ర వేషధారణలు, బ్యాండు మేళాలు, బుట్టబొమ్మలు, కోయ డ్యాన్సులతో వినాయకుని విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలలో ఊరేగింపుగా నిమజ్జనాలకు తరలించారు. వెంకయ్య కాలువ, చినకాపవరం కాలువలో విగ్రహాలను నిమజ్జనం చేశారు. మందిరాల వద్ద భక్తులకు అన్నసమారాధనలు ఏర్పాటు చేశారు.

విఘ్నేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

పెదపాడు: వినాయక చవితి పండుగను పురస్కరించుకుని మండలంలోని పెదపాడు శివారు రామచంద్రపురం, గండిచెరువు గట్టు ప్రాంతాల్లో విఘ్నేశ్వస్వామికి ప్రత్యేక పూజలు చేసారు. అర్చకులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామికి మంగళ హారతులు అందించి ప్రత్యేకంగా తయారు చేసిన ప్రసాదాలను నైవేద్యంగా సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సోమవారం విఘ్నేశ్వస్వామి ప్రతిమను నిమజ్జనం చేయనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

గణనాథుడికి అభిషేకం

ఉంగుటూరు: నవరాత్రిల్లో భాగంగా బాదంపూడి దత్త బాలసుబ్రహమణ్యస్వామి ఆలయంలో విజయ వినాయకస్వామికి ఆలయ నిర్మాత కలవచర్ల శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఆదివారం అభిషేకం, పూజలు నిర్వహించారు. ఉంగుటూరు, రాచూరు, శీతారామపురం, నారాయణపరం ,చేబ్రోలు, కైకరంలో వినాయకుని విగ్రహాలతో ఊరేగింపు నిర్వహించారు. నిమజ్జనోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యుల పర్యవేక్షణలో కార్యక్రమాలు నిర్వహించారు. ఉంగుటూరు బీసీ కాలనీ వినాయకుని, తూర్పుకాపుల వీధిలో వినాయకుని ఊరేగింపు వైభవంగా నిర్వహించారు.

ఘనంగా విఘ్నేశ్వరుని నిమజ్జనం

దెందులూరు: వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా ఆదివారం గ్రామాల్లో ఏర్పాటు చేసిన మండపాల వద్ద పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. దెందులూరు శ్రీ రామ మారుతీ గౌడ యూత్ ఆధ్వర్యంలో ట్రాక్టర్‌పై స్వామివారి విగ్రహాన్ని గ్రామంలో అన్ని వీధుల్లో ఊరేగించారు. యువత కేరింతలు, నృత్యాల నడుమ ఊరేగింపుగా విగ్రహాన్ని తీసుకువెళ్లి గోదావరి కాలువలో నిమజ్జనం చేశారు.

విద్యాశాఖ డైరెక్టర్‌ను కలిసిన ఆర్ఐపీఏ మనోహర్



విజయవాడలో రాష్ట్ర డైరెక్టర్ పీ.పార్వతిని కలిసిన ఆర్ఐపీఏ డాక్టర్ మనోహర్

దెందులూరు: విద్యాశాఖ రాష్ట్ర డైరెక్టర్ పీ. పార్వతిని రీజనల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (ఆర్ఐపీఏ) గోపన్నపాలెం హెచ్ఎం డాక్టర్ మనోహర్ విజయవాడలో కలిశారు. పాఠశాల, వ్యాయామ విద్య, అభివృద్ధి సమస్యలను వివరించినట్లు ఆయన తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో ఏలూరు జిల్లా విద్యార్థులు ప్రతిభచూపి రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం, ఇతర వివరాలను రాష్ట్ర డైరెక్టర్‌కు వివరించామన్నారు.

చర్మ, డప్పు కళాకారులకు పింఛను మంజూరుకు కృషి

దెందులూరు: రాష్ట్ర ప్రభుత్వం లీడ్‌క్యాప్ సహాయ సహకారాలతో అర్హులైన డప్పు, చర్మకారులకు పింఛన్ల మంజూరుకు కృషి చేస్తున్నామని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు పొలిమేర హరికృష్ణ అన్నారు. ఆదివారం దెందులూరులో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో మారిన పరిస్థితులు నేపథ్యంలో చర్మ, డప్పు కళాకారులు జీవన విధానం దుర్భరంగా మారిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొందని ఈ విషయాన్ని తాము సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకరావు దృష్టికి తీసుకువెళ్లామన్నారు. దళితుల అభివృద్ధి, సంక్షేమం, జీవన విధానం మెరుగు పడాలన్న దృఢనిశ్చయంతో ఉన్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పింఛన్ల మంజూరుకు చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. అన్ని జిల్లాల్లో సంఘం ఆధ్వర్యంలో ఈ అంశంపై అవగాహన సమావేశాలు నిర్వహించామని హరికృష్ణ వివరించారు.

మహనీయుల ఆశయ సాధనకు కృషి చేయాలి

- ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి
- రామశింగవరంలో బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ



రామశింగవరంలో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కనకారావు

పెదవేగి : మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేయడంతో పాటు వారి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు మాదిగ, దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. ఆదివారం పెదవేగి మండలం రామసింగవరంలో ఏర్పాటు చేసిన బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ బాబూ జగ్జీవన్ రామ్ అట్టడుగు వర్గాల అభ్యున్నతికి ఎంతగానో కృషి చేశారని అన్నారు. భారత పార్లమెంటులో ఎక్కువ కాలం మంత్రిగా పనిచేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. రైల్వే శాఖ మంత్రిగా పనిచేసిన సమయంలో అనేక సంస్కరణలు చేపట్టారని తెలిపారు. దేశ అభివృద్ధిలో ఆయన చెరగని ముద్ర వేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మెట్లపల్లి సూరిబాబు, వెన్నవల్లి రవి, మహేంద్ర దళిత నాయకులు పెరికే వరప్రసాద్, పొలిమేర హరికృష్ణ, యర్రా నాగమల్లేశ్వరరావు, కూచింపూడి ఎంపీటీసీ కాలి చిన్న బుజ్జి, తేరా ఆనంద్, పెరికే ప్రసాద్, బాబు జగజీవన్ రామ్ కమిటీ సభ్యులు, ఇతర నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

మాదిగ కార్పొరేషన్ చైర్మన్‌ను సత్కరించిన ఎమ్మెల్యే



రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కనకరావును సత్కరిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

పెదవేగి : నియోజకవర్గంలో అన్ని వర్గాల అభివృద్ధే ధ్యేయంగా ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి కృషి చేస్తున్నారని మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకరావు ప్రశంసించారు. పెదవేగి మండలం కొండలరావుపాలెం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరిని, రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకరావు మర్యాదపూర్వకంగా కలిశారు. దెందులూరు నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమంపై కనకరావు ప్రశంసల వర్షం కురిపించారు. అనంతరం కనకరావును ఎమ్మెల్యే దుశ్శాలువాతో సత్కరించి, అభినందించారు.

ధాత్రికి ఘన నివాళి

పెదవేగి : చిన్న వయస్సులో ధాత్రి అనారోగ్యంతో మృతి చెందడం బాధాకరమని ఆమె లేని లోటు కుటుంబానికి తీరనిదని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. పెదవేగి మండలం రాయన్నపాలెంలో కనిగంటి సత్యనారాయణ కుమార్తె కనిగంటి ధాత్రి (8) అనారోగ్యంతో ఆదివారం మరణించింది. ఆమె భౌతికకాయానికి నివాళులర్పించిన అనంతరం ఆమె కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. ధాత్రి మృతికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

వైభవంగా గంగానమ్మ జాతర



గుండుగొలనులో అమ్మవారి ఊరేగింపు

భీమడోలు: మండలంలోని గుండుగొలను, భీమడోలు గ్రామాల్లో గంగానమ్మ జాతర (వారాల పండుగ) వైభవంగా నిర్వహించారు. గుండుగొలనులో ఆరు దశాబ్దాలుగా ఈ వారాల పండుగను ఏటా వినాయకుని చవితి తర్వాత వచ్చే ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. భక్తుల కోర్కెలు తీర్చే గంగానమ్మ ఆలయంలో ఈ గ్రామంలో పుట్టిన వారు దేశంలో ఎక్కడ స్థిరపడినా ఈ పండుగ నాడు గ్రామాలకు చేరుకుంటారు. దీనితో గ్రామాలు బంధువులు, కుటుంబ సభ్యులతో సందడిగా మారాయి. గ్రామంలో ఆరు ఏరియాల్లో గంగానమ్మ ప్రభలను ఏర్పాటు చేసారు. అమ్మవారి ప్రభలను విశేషలంగా అలంకరించి ట్రాక్టర్లపై ఊరేగించారు. తొలుత గ్రామంలోని అమ్మవారి ఆలయంలో భారీ సంఖ్యలో భక్తులు పూజలు చేసారు. అమ్మవారికి మొక్కలు చెల్లించారు. అమ్మవారి భారీ ప్రతిమలను వేర్వేరుగా ఆరు ట్రాక్టర్లపై ఉంచి ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి పసుపు నీళ్ల, టెంకాయలు కొట్టారు. నూతన వస్త్రాలు బహూకరించారు. అమ్మవారిని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు సోదరుడు పుప్పాల కార్తీక్, ఉపసర్పంచ్ ముదుండి సూర్యనారాయణరాజుతో పాటు పలువురు నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు. వివిధ రకాల వేషధారణలతో పలు రకాలు నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేసారు. శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా భీమడోలు ఎస్సై చావా సురేష్ తన సిబ్బంది కలిసి పర్యవేక్షిస్తున్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, పెద్దలు, యువత, చిన్నారులు, మహిళలు పెద్ద ఎత్తున తరలి రావడంతో ఆ ప్రాంతాలు జనం సంద్రంగా మారాయి.

ఎలుకల నిర్మూలనకు సామూహిక కార్యాచరణ



ఎలుకల నిర్మూలనపై రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయ అధికారులు

గణపవరం: సామూహికంగా రైతులంతా ఒకేసారి ఎలుకల నిర్మూలన చర్యలు చేపడితేనే ఫలితం ఉంటుందని వ్యవసాయ అధికారులు రైతులకు సూచించారు. ఆదివారం గణపవరంలో రైతులకు సామూహిక ఎలుకల నిర్మూలన కార్యాచరణపై అవగాహన కల్పించారు. ఈనెల 25, 26 తేదీల్లో మండలంలో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం చేపడతామని, అన్ని రైతు భరోసా కేంద్రాల వద్ద ఎలుకల మందు ఉచితంగా అందజేస్తామని తెలిపారు. 25వ తేదీన రైతులు తమ పొలాలు, పరిసర ప్రాంతంలోని బొరియలను మట్టితో కప్పి ఉంచాలని, తరువాత రోజు తెరుచుకుని ఉన్న బొరియలను గుర్తించి వాటిలో ఎలుకల మందు వేసి కప్పి వేయాలని సూచించారు. మండలానికి 62 కిలోల బ్రోమెడయోలిన్ మందును ప్రభుత్వం అందజేసిందన్నారు. 96 శాతం నూకలు, 2 శాతం నూనె, 2 శాతం ఎలుకల మందు కలిపి చిన్న పొట్లాలుగా కట్టి ఒక్కో కన్నం వద్ద ఒక్కో పొట్లం పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ మురళీకృష్ణ, ఏవో యర్రంశెట్టి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి



పైపులైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ

భీమడోలు: తాగునీటి ఎద్దడి నివారణకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టిని సారించిందని భీమడోలు జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ అన్నారు. భీమడోలు పంచాయతీ పరిధిలోని ఆదర్శ నగర్‌లో పదేళ్లుగా తాగునీరు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర కార్యదర్శి, ఎంపీటీసీ ముళ్లగిరి జాన్సన్ తనకు కేటాయించిన మండల పరిషత్ నిధులు రూ.5 లక్షలతో మంచినీటి పైపులైన్ నిర్మాణానికి ఉపక్రమించారు. దీనితో ఆదివారం ఆ పనులకు జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నూతన పైపులైన్ ద్వారా ఏన్నో ఏళ్ల నాటి సమస్య పరిష్కారమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్, ఎంపీటీసీ ఆళ్లి గోపి, జిల్లా చైతన్య యువజన సంఘం అధ్యక్షుడు పాము మాన్‌సింగ్, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు మద్దాల అప్పారావు, వైసీపీ నేతలు అంబటి నాగేంద్ర ప్రసాద్, పున్నెం గోపి పాల్గొన్నారు.

దళితుల రిజర్వేషన్లను నిర్వీర్యం చేస్తున్న కేంద్రం



దళిత రక్షణ యాత్రలో మాట్లాడుతున్న జక్కంశెట్టి

గణపవరం: దళితులకు రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని దళిత రక్షణ యాత్ర బృంద నాయకుడు జక్కంశెట్టి సత్యనారాయణ అన్నారు. ఆదివారం గణపవరం, సరిపల్లె, కొత్తపల్లిలో దళిత రక్షణ యాత్ర కార్యక్రమం నిర్వహించారు. సరిపల్లెలో యాత్రకు అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామంలో ప్రదర్శన నిర్వహించి, రిజర్వేషన్ల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. ఈయాత్రలో కౌలు రైతు సంఘం , కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి, వ్యవసాయ కార్మిక సంఘం, ప్రజానాట్యమండలి, కౌలు రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

కాలనీ రోడ్లకు మహర్దశ

- రూ.కోట్ల నిధుల తో నిర్మాణం
- చురుగ్గా సాగుతున్న పనులు



కోటేశ్వరదుర్గాపురంలో నిర్మించిన సీసీ రోడ్డు

ఏలూరు రూరల్: ఏలూరు మండల గ్రామాల్లో కాలనీ రోడ్ల అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇందు కోసం అధికారులు మండల పరిషత్, రూర్బన్, ఎన్ఆర్ఈజీఎస్ పథకం నుంచి కోట్ల రూపాయల నిధులు వెచ్చిస్తున్నారు. రోడ్ల నిర్మాణంలో మొదట ప్రాధాన్యత పేదల నివసించే ఎస్సీ, బీసీ కాలనీలకు ఇస్తున్నారు. తర్వాత ప్రధాన గ్రామంలో రోడ్లు అభివృద్ధి పర్చేందుకు ప్రణాళిక రూపొందించారు.

పనులు ఇలా..

ఇప్పటికే అనేక గ్రామాల్లో కాంట్రాక్టర్లు పనులు కొనసాగిస్తున్నారు. పెద్ద ఎత్తున గ్రావెల్, క్రషర్‌డస్ట్‌తో పాటు సిమెంట్, చిప్స్ తరలిస్తున్నారు. గ్రావెల్ రోడ్డు 8 అంగుళాలు ఎత్తు పోస్తున్నారు. దీన్ని రోలింగ్ చేయడం వల్ల 6 అంగుళాలకు దిగుతోంది. ఇదే క్రమంలో సీసీ రోడ్లు వేసే ముందు 8 అంగుళాలు ఎత్తుకు వెట్ మిక్సర్, డస్ట్ పోస్తున్నారు. దానిపై చిప్స్, సిమెంట్‌తో కూడిన మిక్సర్ 7 అంగుళాలు ఎత్తు పోస్తున్నారు. ఫలితంగా నిన్నటి వరకూ మట్టి రోడ్లతో బురదమయమైన కాలనీరోడ్లు గ్రావెల్ రోడ్లుగా రూపుదిద్దుకున్నాయి. గ్రావెల్ రోడ్లు సీసీ రోడ్లుగా మారుతున్నాయి. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆదేశాల మేరకు రోడ్లు పనులు ముమ్మరంగా చేపట్టామని ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు చెప్పారు.

రూ.4 కోట్ల పనులు ప్రారంభం

కొద్దివారాల క్రితం ప్రభుత్వం రూ.4 కోట్ల రూర్బన్ నిధులతో సీసీ రోడ్లు అభివృద్ధి ప్రారంభించింది. ఇందులో ప్రత్తికోళ్లలంకకు రూ.22.12 లక్షలు, పైడిచింతపాడుకు రూ.17.99 లక్షలు, కోటేశ్వరదుర్గాపురానికి రూ.55.44 లక్షలు, గుడివాకలంకకు రూ.31.22 లక్షలు, మొండికోడుకు రూ.32.73 లక్షలు, చాటపర్రుకు రూ.75.04 లక్షలు, జాలిపూడిలో రూ.34.23 లక్షలు, మాదేపల్లిలో రూ.44.80 లక్షలు, మల్కాపురంలో రూ.33.25 లక్షలు, శ్రీపర్రుకు రూ.53.18 లక్షలు కేటాయించింది.. ఇప్పటికే మండల పరిషత్ నిధులతో మాధవపురంలో రూ.8 లక్షలతో గ్రావెల్ రోడ్డు పోశారు. గుడివాకలంక ఎస్సీకాలనీలో మట్టి రోడ్లు అన్నీ గ్రావెల్ రోడ్లుగా అభివృద్ధి చేశారు. కోటేశ్వరదుర్గాపురంలో ప్రస్తుతం 900 మీటర్ల సీసీ రోడ్లు పనులు సాగుతున్నాయి. ఇదే క్రమంలో మరిన్ని గ్రామాల్లో పనులు చేపట్టనున్నామని పీఆర్ ఏఈ కృష్ణమోహన్ చెప్పారు. కొక్కిరాయిలంక కాలనీరోడ్లు అన్నీ గ్రావెల్ రోడ్లుగా రూపుదిద్దుకున్నాయి. కొద్దిరోజులుగా ప్రత్తికోళ్లలంక జడ్పీ పాఠశాల రోడ్డు, ఎస్సీకాలనీ సీసీ రోడ్ల పనులు చురుగ్గా సాగుతున్నాయి.